సాక్షి
వికారాబాద్
మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



‘హరితహారం’పై నిర్లక్ష్యపు నీడ
అధికారుల నిర్లక్ష్యంతో హరితహారం అభాసుపాలవుతోంది. ఏటా మొక్కలు నాటుతున్నా.. సంరక్షణ మాత్రం గాలికొదిలేస్తున్నారు. 8లో ▸



నాడు కళకళ.. నేడు వెలవెల
మూడు నెలల క్రితం వరకు పర్యాటకులతో కళకళలాడిన కోట్‌పల్లి ప్రాజెక్టు నేడు జనం లేక బోసిపోతోంది. 8లో ▸



పని చేస్తేనే అభివృద్ధి
అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ అన్నారు. 8లో ▸



కాసులు రాలలే!

ఆస్తి పన్ను వసూలులో ఈఏడాది ఆశించిన ఫలితాలు రాలేదు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల ద్వారా 2022– 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సుమారు రూ.15 కోట్లు రావాల్సి ఉండగా.. రూ.9 కోట్లు మాత్రమే వసూలయ్యాయి.

ఆస్తి పన్ను వసూలులో తడబడ్డ మున్సిపాలిటీలు
- వికారాబాద్ మినహా మూడు చోట్లా ఇదే పరిస్థితి
- సగం టార్గెట్ కూడా పూర్తిచేయని తాండూరు
- పరవాలేదనిపించిన కొడంగల్
- జిల్లాలో సేకరించిన మొత్తం 63 శాతమే


వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని వికారాబాద్ మినహా మిగిలిన మూడు మున్సిపాలిటీలు పన్నుల వసూలులో వెనకబడ్డాయి. దీంతో కార్మికుల వేతనాల చెల్లింపుతో పాటు ఆయా పట్టణాల్లో సమస్యల పరిష్కారానికి నిధుల కొరత సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

63 శాతం వసూలు
గతేడాదితో పోలిస్తే ఈసారి నాలుగు మున్సిపాలిటీల్లోనూ పన్నుల వసూలు మందగించింది. 2021–22లో 90శాతం పన్నులు వసూలు కాగా.. ఈసారి 63 శాతానికి పడిపోయింది. నాలుగు మున్సిపాలిటీల్లో 37,266 నివాసాలు ఉండగా రూ.15,43,65,000 ఆస్తి పన్ను సేకరించాల్సి ఉంది. కానీ మార్చి 31 నాటికి కేవలం రూ.9,82,73,000 మాత్రమే వసూలయ్యాయి. అత్యధిక శాతం పన్నులు సేకరించిన మున్సిపాలిటీల జాబితాల్లో వికారాబాద్ రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలవగా.. కొడంగల్ పరవాలేదనిపించింది. తాండూరు, పరిగి పూర్తిగా వెనకబడ్డాయి.

వికారాబాద్‌లో 96శాతం
వికారాబాద్ మున్సిపాల్టీలో 14,252 నివాసాలు ఉండగా ఆస్తి పన్ను లక్ష్యం రూ.3,51,69,000గా ఉంది. ఇప్పటి వరకు రూ.3,39,30,000 వసూలు చేశారు. ఈమొత్తం 96.46శాతంగా ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొదటి స్థానం, రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

కొడంగల్‌లో 82 శాతం వసూలు
కొడంగల్ మున్సిపాలిటీలో 4,047 నివాసాలు ఉండగా రూ.94,29,000 ఆస్తి పన్ను రావాలి. ఇప్పటి వరకు రూ.77,50,000 వసూలు చేశారు. ఈ లెక్కన 82 శాతం వసూలు చేశారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ కావడం, గ్రామీణ ప్రాంత నేపథ్యం ఉండటంతో పన్నుల చెల్లింపుపై పూర్తిస్థాయిలో ప్రజలకు చైతన్యం రాలేదని అధికారులు చెబుతున్నారు.

తాండూరులో 47శాతమే
తాండూరు మున్సిపాలిటీలో 13,952 నివాసాలు ఉండగా.. రూ.8,87,000 పన్నులు సేకరించాలి. కానీ కేవలం రూ.4,25,000 మాత్రమే వసూలు చేశారు. అంటే 47 శాతం మాత్రమే సేకరించారు. పన్నుల వసూలులో తాండూరు మున్సిపాలిటీ పూర్తిగా వెనకబడింది. జిల్లాలోనే తొలిసారిగా ఏర్పడిన పెద్ద మున్సిపాలిటీ అయినప్పటికీ పన్నుల వసూలులో మాత్రం చతికిలబడింది. ఇక్కడ ఆస్తి పన్నుల వసూలు విషయంలో స్థానిక రాజకీయ పరిస్థితులు కూడా కొంత ప్రభావం చూపాయని అధికారులు చెబుతున్నారు.

పరిగిలో 66 శాతం
పరిగి మున్సిపాలిటీలో 5,015 నివాసాలున్నాయి. రూ.2,10,67,000 సేకరించాల్సి ఉండగా.. రూ.1,40,93,00 వసూలు చేసి, 66 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. ఇది కూడా కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీయే. పరిగి మున్సిపాలిటీగా అవతరించక ముందే పట్టణం అన్ని విధాలుగా అభివృద్ధి సాధించింది. కానీ పన్నుల వసూలులో మాత్రం అధికారులు వెనకబడ్డారు.

వడ్డీ మినహాయింపు లేదు
కరోనా నేపథ్యంలో 2019– 20, 2020– 21 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఆస్తి పన్ను బకాయి ఉన్న గృహాల వడ్డీ నుంచి తొంభై శాతం మినహాయింపు ఇచ్చారు. అప్పట్లో కేవలం పది శాతం వడ్డీతో చెల్లించే అవకాశం కల్పించారు. దీంతో ఆ రెండేళ్లలో మున్సిపాలిటీలో పెద్దఎత్తున ఆస్తి పన్నులు వసూలయ్యాయి. ఈ ఏడాది ఎలాంటి మినహాయింపు లేకపోవడంతో పన్నుల వసూలులో ఆయా మున్సిపాలిటీలు కొంత వెనకబడ్డట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 2023– 24 ఆర్థిక సంవత్సరానికి చెందిన ఆస్తి పన్ను ఒకేసారి చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇచ్చారు. దీనిపై గృహ యజమానులు పెద్దగా ఆసక్తి చూపలేదు.

ఐదుశాతం రాయితీ ఉంది



మున్సిపాలిటీల పరిధిలో 2023– 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లించే వారికి ఐదు శాతం మినహాయింపు వర్తిస్తుంది. ఈ అవకాశాన్ని గృహ యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. వికారాబాద్ మున్సిలిటీలో 96శాతానికి పైగా పన్నులు వసూలు చేశాం. ఇందుకు పట్టణ ప్రజలు ఎంతగానో సహకరించారు.
– శరత్‌చంద్ర, మున్సిపల్ కమిషనర్, వికారాబాద్



ఉత్తమ కృషికి సన్మానం

పరిపాలన విభాగంలో జాతీయ ఉత్తమ పంచాయతీగా చీమల్‌దరి ఎంపిక కావడం అభినందనీయమని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీపీఓ తరుణ్‌కుమార్, ఎంపీడీఓ శైలజారెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీఓ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి సుగుణను ఘనంగా సన్మానించారు.
– మోమిన్‌పేట

ఆ ఫ్యాక్టరీని మూసేయండి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన గుంతబాస్పల్లి సర్పంచ్
- పీసీబీ జారీ చేసిన ఉత్తర్వుల కాపీ అందజేత

తాండూరు రూరల్: మండల పరిధిని గుంతబాస్పల్లి శివారులో కొనసాగుతున్న ఇండస్ కెమ్ ఫ్యాక్టరీని మూసేయాలని సర్పంచ్ జగదీశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, తాగు, సాగు నీరు కలుషితమవుతోందంటూ గతంలోనే కలెక్టర్, మానవ హక్కుల సంఘం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై స్పందించిన పీసీబీ ఫ్యాక్టరీని మూసేయాలని ఆదేశిస్తూ మార్చి 15న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కానీ యాజమాన్యం మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా కంపెనీని కొనసాగిస్తోందని మండిపడ్డారు. ఈ విషయమై తాము కాలుష్య నియంత్రణ మండలిని సంప్రదించగా.. ఉత్తర్వుల కాపీని వాట్సాప్‌లో పంపారని సర్పంచ్ తెలిపారు. ఈ ప్రతితో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుంతబాస్పల్లి శివారులో ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న ఇండస్ కెమ్ కంపెనీ నుంచి చాలా మందికి ముడుపులు అందుతున్నాయని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.


ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ జగదీశ్

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: సుస్థిర ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ఎల్‌ఎల్‌పీలో ఉద్యోగాల భర్తీ కోసం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10:30 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల్లో సుమారు వంద ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ పూర్తి చేసిన వారు మేళాకు హాజరు కావాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు హైదరాబాద్‌లోని కంపెనీల్లో పనిచేయాల్సి ఉంటుందని, వివరాలకు ఫోన్ నంబర్ 9676047444లో సంప్రదించాలని తెలిపారు.

మినీ ఫంక్షన్ హాల్ పనులు ప్రారంభం


కుల్కచర్లలో పనులు ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: రైతు కుటుంబాల అభ్యున్నతికి సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్విరామంగా కృషిచేస్తున్నామని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. రూ.35 లక్షల నిధులతో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మినీ ఫంక్షన్ హాల్ పనులకు సోమవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు వివాహ, ఇతర శుభకార్యాలు చేసుకునేందుకు ఫంక్షన్ హాల్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, సీఈఓ బక్కారెడ్డి, డైరెక్టర్ కొండయ్య, సిబ్బంది హాలిం, నాయకులు రాంరెడ్డి, రాములు, నరేష్, రవీందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 266 ఫిర్యాదులు


ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ‘ప్రజావాణి’కి వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా ప్రజల నుంచి వచ్చిన 266 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిని ఆయా విభాగాల వారికి అందజేశారు. దరఖాస్తుల ప్రాధాన్యతను బట్టి తక్షణమే పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తులు పెండింగ్ పెట్టడంతో మళ్లీ అప్లికేషన్ వస్తే సదరు అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు ఉన్నారు.

ఎస్పీని కలిసిన స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్



అనంతగిరి: మహబూబ్‌నగర్ జిల్లా సీసీఎస్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చిన రామకృష్ణ సోమవారం మర్యాదపూర్వకంగా ఎస్పీ కోటిరెడ్డి కలిశారు.

నేడు పూలే జయంతి

వికారాబాద్ అర్బన్: కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించనున్న జ్యోతిబాపూలే జయంతి వేడుకలకు అందరూ కావాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు బీసీ నేతలు హాజరు కావాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్ కోరారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న వీఓఏలు

వీఓఏల వేతన పోరాటం

వికారాబాద్ అర్బన్: ఏళ్ల తరబడి అరకొర వేతనాలతో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీఓఏలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ.. కేవలం రూ.3,900 వేతనం ఇస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా, కార్మిక చట్టం ప్రకారం రూ.18 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.5 ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని, పీడీ సంతకంతో కూడిన ఐడీ కార్డులు మంజూరు చేయాలని, జీఓ 58ని సవరించాలని కోరారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని తెలిపారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ కృష్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సలహాదారులు గోవర్ధన్, గోపాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావలి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే

కొడంగల్: అనారోగ్యంతో చనిపోయిన బీఆర్‌ఎస్ కార్యకర్త పాడె మోశారు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి. వివరాలు ఇలా ఉన్నాయి.. కోస్గి మున్సిపల్ మూడో వార్డు కౌన్సిలర్ లక్ష్మమ్మ ఆరోగ్య సమస్యలతో చనిపోయింది. ఆమె అంత్యక్రియలు మల్‌రెడ్డిపల్లిలో సోమవారం జరిగాయి. అంతిమ సంస్కారాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. బీఆర్‌ఎస్ జెండా మోసిన లక్ష్మమ్మ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని తెలిపారు. అనంతరం కోస్గి ఆస్పత్రిలో బాలింతలకు కేసీఆర్ కిట్లు పంపిణీ చేశారు. ఆస్పత్రిలో పర్యటించి రోగులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కోస్గిలో కొత్తగా నిర్మిస్తున్న 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పాడె మోస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

గురుకులాలకు గూడు కరువు

- అరకొర వసతుల నడుమ విద్యార్థుల అవస్థలు
- అద్దె భవనాలను సమకూర్చడంలోనూ నేతలు, అధికారుల విఫలం
- పక్క జిల్లాకు వలస వెళ్తున్న రెసిడెన్షియల్ పాఠశాలలు
- సొంత భవనాలపై దృష్టి సారించని ప్రభుత్వం



పరిగిలో అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ గురకుల పాఠశాల

వికారాబాద్: గురుకులాలకు గూడు కరువై విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఆర్భాటంగా వీటిని మంజూరు చేస్తూ వెళ్లిన ప్రభుత్వం సొంత భవనాల నిర్మాణాన్ని విస్మరించింది. ఈ నేపథ్యంలో మన జిల్లాకు మంజూరైన గురుకులాలు పక్క జిల్లాలో కొనసాగుతున్నాయి. చిన్న విషయాలపై అనేక రాజకీయాలు చేసే ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నేతలకు ఈ అంశం పట్టడం లేదు. కనీసం గురుకులాల నిర్వహణకు జిల్లాలో అద్దె భవనాలు కూడా సమకూర్చలేపోతున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న ఇంజనీరింగ్ కళాశాలల ఓనర్లు.. అద్దె కోసం మన జిల్లాలోని గురుకులాలను పక్క జిల్లాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే నాలుగు రెసిడెన్షియల్ పాఠశాలలు రంగారెడ్డి వలస వెళ్లాయి. జిల్లాలో కొనసాగుతున్న వాటిలో వసతులు కరువయ్యాయి. సరైన స్థలాలు లేకపోవడంతో విద్యార్థులకు ఆటాపాటా లేకుండాపోయింది. కనీసం తల్లిదండ్రులు వచ్చిన సమయంలో పిల్లలతో కూర్చుని మాట్లాడే పరిస్థితి కూడా లేకపోవడం విడ్డూరం.

ఒక్కో నియోజకవర్గంలో ఆరు
గతంలో నియోజకవర్గానికి రెండు గురుకుల పాఠశాలలు ఉండగా తెలంగాణ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మరో నాలుగు చొప్పున మంజూరు చేసింది. దీంతో జిల్లాలో వీటి సంఖ్య 24కు చేరింది. గతంలో ఉన్న ఎనిమిది గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు ఉండగా.. 16 గురుకులాలను అద్దె భవనాల్లో ప్రారంభించారు. వీటిలో కేవలం ఒక్క స్కూల్‌కు మాత్రమే సొంత భవనం నిర్మించారు. ఏడేళ్లు దాటినా మిగిలిన వాటి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. గురుకుల పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం పెద్ద మొత్తంలో అద్దె చెల్లిస్తోంది. దీంతో పక్క జిల్లాలో మూతపడిన ఇంజనీరింగ్ కాలేజీల దృష్టి ఇటువైపు మళ్లింది. రెసిడెన్షియల్ పర్యవేక్షణాధికారులకు పర్సెంటేజీలు ముట్టజెప్పి.. ఇక్కడ కొనసాగుతున్న గురుకులాలను రంగారెడ్డి జిల్లా పరిధిలోని తమ భవనాలకు తరలించారు.

ప్రతి నెలా రూ.10 లక్షలు
ఏడేళ్ల క్రితం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా జిల్లాకు మహిళా డిగ్రీ కాలేజీ మంజూరైంది. భవనం నిర్మించే వరకు వికారాబాద్‌లోని కొత్తగడిలో కళాశాల కొనసాగేందుకు ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నానికి తరలించారు. అక్కడ స్థలం సరిపోవడం లేదంటూ మొయినాబాద్‌కు మార్చారు. ఏడాది గడవగానే చేవెళ్ల సమీపంలోని తోల్‌కట్ట వద్ద ఉన్న ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల భవనంలోకి మార్చారు. దీనికి ప్రతి నెలా రూ.6 లక్షల అద్దె చెల్లిస్తున్నారు. మూడేళ్ల క్రితం పరిగిలో పరిగితో పాటు బురాన్‌పూర్‌కు సంబంధించిన రెండు బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించారు. వీటిలో ఒక్కో స్కూల్‌కు నెలకు రూ.98 వేలు చెల్లించారు. అనంతరం పలు సమస్యలను సాకుగా చూపుతూ బురాన్‌పూర్ బీసీ గురుకులాన్ని చేవెళ్ల మండల పరిధిలోని ఊరెళ్ల ఇంజనీరింగ్ కళాశాలకు మార్చారు. ఆతర్వాత మరో గిరిజన బాలికల గురుకులాన్ని కూడా జిల్లా దాటించారు. మన జిల్లాలో భవనం అద్దె రూ.98 వేలు చెల్లించగా.. రంగారెడ్డికి తరలించిన తర్వాత రూ.10 లక్షలు చెల్లిస్తుండటం గమనార్హం.

చెట్లే జీవకోటికి ప్రాణాధారం

మొయినాబాద్: చెట్లే జీవకోటికి ప్రాణాధారమని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. అనంతకోటి వృక్ష మహోత్సవం కార్యక్రమంలో భాగంగా టీఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని పెద్దమంగళారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, పాఠశాల హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయులు అపర్ణ, భీమ్లా, పుష్ప, రవికుమార్, మల్లేశ్వరి, హేమలత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- మంత్రి సబితా రెడ్డి

పహాడీషరీఫ్: రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తూనే పేదలకు దానధర్మాలు చేయడం గొప్ప విషయమని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పహాడీషరీఫ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దసరా సందర్భంగా బతుకమ్మ చీరలు, క్రిస్మస్ పండుగకు కానుకల మాదిరిగానే రంజాన్‌కు తోఫా అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆమె ప్రత్యేక ప్రార్థనలు జరిగే ఈద్గాను పరిశీలించి రంజాన్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ నాయకురాలు యాస్మిన్‌కు ఖర్జూర అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి

క్లుప్తంగా

ఆలయ భూమి పరిశీలన



భూమి హద్దులు పరిశీలిస్తున్న రామకృష్ణ

అనంతగిరి: పట్టణ పరిధిలోని అనంతపద్మనాభ స్వామి ఆలయ భూములను సోమవారం దేవాదాయ శాఖ ఆర్‌జేసీ రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో నరేందర్ మాట్లాడుతూ.. నార్సింగి సమీపంలోని మంచిరేవుల వద్ద సర్వే నంబర్ 446లో ఆలయానికి 10గుంటల భూమి ఉందన్నారు. దాన్ని దేవాదాయ శాఖ ఆర్‌జేసీ రామకృష్ణ పరిశీలించారని పేర్కొన్నారు. ఔటర్ రోడ్డుకు దగ్గరగా ఉన్నందున భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై ఎంపీడీఓకు ఫిర్యాదు



కార్యదర్శిపై ఫిర్యాదు చేస్తున్న ఆనంద్

పెద్దేముల్: గ్రామ సమస్యలు పట్టించుకోని పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్ నాయక్ సోమవారం ఎంపీడీఓ లక్ష్మప్పకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కందనెల్లి తండా పంచాయతీ కార్యదర్శి వాణి ప్రజలకు కనీస వసతులు కల్పించడం లేదన్నారు. ఆరు నెలలకు ఒక్కసారి కూడా మంచి నీటి ట్యాంకును శుభ్రం చేయడం లేదని తెలిపారు. దీంతో తండా వాసులు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కందనెల్లి తండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కురుమలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

సంఘం డివిజన్ అధ్యక్షుడు జగదీష్



బాలును సన్మానిస్తున్న సంఘం నాయకులు

తాండూరు టౌన్: కురుమలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు జగదీష్ అన్నారు. మహాత్మా జ్యోతి బాపూలే జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఎన్నికైన బాలును సోమవారం సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమలు విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. సంఘం సభ్యులు సంఘటితంగా ఉంటూ కురుమల సంక్షేమానికి పాటుపడాలన్నారు. అనంతరం బాలు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి, నన్ను ప్రోత్సహించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం వికారాబాద్ కలెక్టరేట్, హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరగనున్న జ్యోతిబాపూలే జయంతిని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కురుమ సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు పూజారి పాండు, నాయకులు ఇందూర్ మల్లేశం, దోమ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు

పరిగి: పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని చిట్యాల గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'హరితహారం'పై నిర్లక్ష్యపు నీడ

మొక్కలు నాటడంపై ఉన్న శ్రద్ధ.. సంరక్షణపై లేదు

- రోడ్లకు ఇరువైపులా కాలిపోతున్న మొక్కలు
- పట్టించుకోని పంచాయతీలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

నవాబుపేట: అధికారుల నిర్లక్ష్యంతో హరితహారం కార్యక్రమం అభాసుపాలవుతోంది. ప్రతి ఏటా లక్ష్యం మేర హరితహారం మొక్కలు నాటుతున్నా.. వాటి సంరక్షణ మాత్రం గాలికొదిలేస్తున్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పేరుతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లకు ఇరువైపులా వేల సంఖ్యలో మొక్కలు నాటుతున్నారు. కానీ వాటి సంరక్షణ బాధ్యతలు మాత్రం పట్టించుకోవడం లేదు. రోడ్లకు ఇరువైపులా గడ్డి ఏపుగా పెరగడం.. వేసవిలో అవి ఎండిపోవడం.. ఆకతాయిలు ఎండు గడ్డికి నిప్పు పెట్టడంతో హరితహారం మొక్కలు కూడా కాలి బూడిద అతున్నాయి. కానీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రతిఏటా అవెన్యూప్లాంటేషన్

హరితహారంలో భాగంగా అవెన్యూప్లాంటేషన్ పేరిట ప్రతి ఏటా ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లకు ఇరువైపులా వేల మొక్కలు నాటుతున్నారు. ఈ ఏడు వర్షాకాలంలో ఒక్క నవాబుపేట మండలంలోని అక్నాపూర్, ఆర్కతల, అత్తాపూర్, చించల్‌పేట, చిట్టిగిద్ద, ఎత్‌రాజ్‌పల్లి, గంగ్యాడ, తదితర గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా 11 వేల మొక్కలు నాటారు. కానీ వాటి సంరక్షణ పట్టించుకోలేదు. మొక్కల చుట్టూ ఏపుగా గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటిని తొలగించకపోవడం, హరితహారం మొక్కలకు నీరు పోయడం వంటివి చేపట్టలేదు.



వట్టిమీనపల్లిలో గడ్డితో పాటు కాలిపోయిన హరితహారం మొక్కలు

కాలిపోతున్న మొక్కలు

అవెన్యూ ప్లాంటేషన్ పేరుతో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం తరువాత పట్టించుకోకపోవడం అధికారులకు పరిపాటిగా మారింది. మొక్కల చుట్టు పెరిగిన గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెడుతున్నారు. ఈ కారణంగా హరితహారం మొక్కలు కూడా కాలిపోతున్నాయి. ఇటీవల ఎల్లకొండ, లింగంపల్లి, పులుమామిడి, గొల్లగూడ, నారెగూడ, మాదిరెడ్డిపల్లి, వట్టిమీనపల్లి తదితర గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న మొక్కలు కాలిపోయాయి. ఇలా ప్రతి ఏటా జరుగుతున్నా అధికారులు, పంచాయతీలు గానీ పట్టించుకోవడం లేదు. మరి కొన్ని గ్రామాల్లో గడ్డి తొలగించినా మొక్కలకు నీరు పెట్టకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. అయితే మొక్కల సంరక్షణ బాధ్యత మీదంటే మీదని అటు పంచాయతీలు ఇటు ఉపాధి హామీ సిబ్బంది ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారు. పంచాయతీ సిబ్బంది, అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ సైతం ఆగ్రహం

ఇటీవల మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ అవెన్యూప్లాంటేషన్ నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ''రోడ్లకు ఇరువైపులా ఎక్కడా మొక్కలు కనిపించడంలేదు.. ప్రతిఏటా ఎన్ని మొక్కలు నాటుతున్నారు.. ఎన్ని బతికాయి.. మొక్కలు ఎండిపోతుంటే, కాలి పోతుంటే మీరేం చేస్తున్నారు.. ఈ ఒక్క కారణం చాలదా మీ అందరిని సస్పెండ్ చేయడానికి'' అంటూ కలెక్టర్ నారాయణరెడ్డి.. ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది, పాలకులు, ఉపాధి హామీ సిబ్బంది హరితహారం మొక్కలు ఎండిపోకుండా కాలిపోకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది.

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

అనంతగిరి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం వికారాబాద్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చంద్రకళ అధ్యక్షతన జరిగింది. తొలుత అవార్డులు అందుకున్న గ్రామాలను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల సర్వసభ్య సమావేశాలకు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, గ్రామాల అభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. నేడు గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని అన్నారు. ప్రజాప్రతినిధులు సూచించిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎక్కడి సమస్యలను అక్కడే పరిష్కరించాలన్నారు. వేసవి ఉన్నందున పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఎంపీపీ చంద్రకళ మాట్లాడుతూ.. అందరం కలిసి పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. మండలానికి 3 అవార్డులు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. కొటాలగుడెం - లాల్‌సింగ్ తండా రోడ్డు పూర్తిగా కంకర తేలిందని వెంటనే బాగు చేయాలని సర్పంచ్ రాములు నాయక్ కోరారు. గ్రామ పంచాయతీకి చెందిన విద్యుత్ చార్జీలు ఎక్కువగా వస్తున్నాయని కామరెడ్డిగూడ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి విద్యుత్ అధికారుల దృష్టికి తెచ్చారు. ఇటీవల పలు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వెంటనే పనులు ప్రారంభించాలని పలువురు సర్పంచులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, వైస్ ఎంపీపీ కొండిగారి రాములు, పీఆర్ డీఈ మాధవరెడ్డి, ఎంపీఓ నాగరాజు, ఏఈలు చాణక్యరెడ్డి, రవి, కోఆప్షన్ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, ఎంపీటీసీలు, సర్పంచులు కమాల్‌రెడ్డి, మాధవరెడ్డి, అంజయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మేం అధికారంలోకి వచ్చాక..



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తట్టెపల్లికి మండల హోదా

- పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్

పెద్దేముల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తట్టెపల్లికి మండల హోదా కల్పిస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్ హామీ ఇచ్చారు. సోమవారం తట్టెపల్లిలో మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు ఆయన జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, వర్కింగ్ ప్రసిడెంట్ పీ ప్రవీణ్‌కుమార్‌తో కలసి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తట్టెపల్లి అన్ని రంగాల్లో వెనుక బడి ఉందని, మండలంగా ప్రకటిస్తే అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వెంటనే తట్టెపల్లికి మండల హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు కూడా వినతి పత్రం అందజేస్తామని పేర్కొన్నారు. ఏడాది నుంచి గ్రామ ప్రజలు మండలం కోసం దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. ఈ ప్రాంత ప్రజలు చిన్నపాటి వైద్యం కోసం కూడా 30కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ సర్పంచ్‌లు శివరాం నాయక్, మల్లప్ప, వెంకటేశం, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభు కుమార్, తట్టెపల్లి ఉప సర్పంచ్ కిష్టప్ప, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఖదీర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- రెండు బైక్‌లు ఢీ
- ఒకరి మృతి, మరో నలుగురికి తీవ్ర గాయాలు

పరిగి: అంత్యక్రియలకు వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా మరో బైక్ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని లక్నాపూర్ గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం మేరకు.. నవాబుపేట మండలం ఎక్‌మామిడి గ్రామానికి చెందిన వడ్ల బ్రహ్మచారి(42) ఆయన భార్య చిట్టి, బంధువు రాధిక రూప్‌ఖాన్‌పేట్‌లో బంధువు అంత్యక్రియలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గడి సింగాపూర్ వద్ద మల్లేమోనిగూడకు చెందిన సుధాకర్ బైక్ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బ్రహ్మచారి అక్కడికక్కడే మృతి చెందాడు. రాధికకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఉస్మానియకు తరలించారు. మరో బైక్‌పై ఉన్న సుధాకర్, నయింలకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం నగరానికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నాడు కళకళ.. నేడు వెలవెల



గతంలో కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి



పర్యాటకులు లేక వెలవెలబోతున్న ప్రాజెక్టు పరిసరాలు

- పర్యాటకులు లేక బోసిపోయిన 'కోట్‌పల్లి'
- చిరు వ్యాపారుల ఉపాధిపై ప్రభావం
- కలెక్టర్‌ను కలసి నిషేధం ఎత్తివేయాలని కోరిన జనం
- త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ

ధారూరు: మూడు నెలల క్రితం వరకు పర్యాటకులతో కళకళలాడిన కోట్‌పల్లి ప్రాజెక్టు నేడు జనం లేక బోసిపోయి దర్శనమిస్తోంది. జనవరి 16న ఈ ప్రాజెక్టు నీటిలో మునిగి నలుగురు చనిపోయారు. అప్పటి నుంచి అధికారులు ప్రాజెక్టుకు పర్యాటకుల రాకను నిషేధించారు. అయితే అధికారుల నిర్ణయంపై అక్కడ ఉపాధి పొందుతున్న పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పలువురు మాట్లాడుతూ.. ప్రాజెక్టు నీటిలో మునిగి నలుగురు చనిపోయారని నిషేధం విధించడం సరికాదన్నారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సింది పోయి నిషేధం విధించడం ఏమిటని ప్రశ్నించారు. అధికారుల చర్యల వల్ల దాదాపు 30 కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సోమవారం వారు కలెక్టర్‌ను కలిసినట్లు వారు తెలిపారు. కోట్‌పల్లి ప్రాజెక్టును పర్యాటకులు సందర్శించడానికి అనుమతి ఇవ్వాలని, పర్యాటకులు వస్తే తమకు ఉపాధి లభిస్తుందని కలెక్టర్‌కు తెలిపారు. నిషేధం వల్ల తాము వీధిన పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

నలుగురు చనిపోవడంతో నిషేధం

ఆదివారం వచ్చిందంటే కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకులతో సందడిగా మారిపోతుంది. జనవరి 16న పూడూర్ మండలం మన్నెగుడకు చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు యువకులు ఈత కోసం ప్రాజెక్టు నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. దీంతో ఇరిగేషన్, రెవెన్యూ, అటవీశాఖ, పోలీసు శాఖలు ప్రాజెక్టు పరిసరాలకు ఎవరూ వెళ్లకుండా నిషేధం విధించారు. ప్రాజెక్టు వద్ద కొనసాగుతున్న కాయకింగ్ బోటింగ్‌ను సైతం ప్రాజెక్టు అవతలి వైపునకు తరలించారు.

ప్రాజెక్టు దారుల్ని మూసేసిన ఫారెస్టు శాఖ

ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లే అన్ని దారుల్ని అటవీ శాఖ అధికారులు మూయించారు. దీంతో ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కూడా ప్రాజెక్టు సందర్శనకు అవకాశం కల్పించాలని గడ్డమీది గంగారం సర్పంచ్ అమర్‌నాథ్ కోరారు.

ఉపాధి కోల్పోయాం

కోట్‌పల్లి ప్రాజెక్టుకు నిత్యం పర్యాటకులు వస్తుంటారు. దీంతో చిరుతిళ్లు, కూల్ డ్రింక్స్ విక్రయించి ఉపాధి పొందుతుంటాం. ఇటీవల నలుగురు చనిపోవడంతో పర్యాటకుల రాకను నిషేధించారు. దీంతో ఉపాధిని కోల్పోయి వీధిన పడ్డాం. కాయకింగ్ బోటింగ్ సంస్థలో పనిచేయడం వల్ల నెలనెలా జీతాలు అందేవి. ప్రస్తుతం బోటింగ్ లేక వీధిన పడ్డాం. ఇదే విషయాన్ని కలెక్టర్‌తో మొరపెట్టుకున్నాం.

– చిరు వ్యాపారులు

దళితులపై దాడులకు పాల్పడితే సహించం

తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్

పూడూరు: దళితులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గొంగుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చన్గోముల్ గ్రామానికి చెందిన దళితుడు నవీన్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ వద్ద 4 ఎకరాల పొలం అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలిపారు. అందులో నవీన్, అతని బంధువులు పనులు చేస్తుండగా పరిగి ఎమ్మెల్యే అనుచరులు దాడి చేశారని అన్నారు. ట్రాక్టర్, బైక్‌ను గుంతలోకి నెట్టేసి తగులబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై చన్గోముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎస్ఐ పట్టించుకోలేదన్నారు. అధికార పార్టీ నాయకులకే వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు తప్పుడు పత్రాలు సృష్టించి నవీన్ భూమిని కాజేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అనుచరులతో బాధితుడికి ప్రాణహాని ఉందని తెలిపాడు. ఈ విషయమై పరిగి డీఎస్పీ, సీఐలకు ఫిర్యాదు చేశామని తెలిపారు. దళితులపై దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అధికారులను కోరారు. టీఎంపీఎస్ రాష్ట్ర నాయకులు సాంబయ్య, నర్సింగ్‌రావు, బీ నర్సింలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

రూ. 2కోట్లతో కురుమ ఆత్మగౌరవ భవనం

ఎమ్మెల్సీ మల్లేశం

అనంతగిరి: జిల్లా కేంద్రంలో కురుమ ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి ఎకరా స్థలాన్ని కేటయించి, రూ. 2కోట్లతో భవనాన్ని నిర్మిస్తామని ఎమ్మెల్సీ, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గే మల్లేశం తెలిపారు. ఆదివారం ఆయన్ను వికారాబాద్ కురుమ సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. దొడ్డి కొమురయ్య విగ్రహ ప్రతిష్ఠాపనకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కురుమ సంఘం భవన నిర్మాణానికి తన వంతుగా రూ. 50లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే కూడా రూ. 50లక్షలు ఇచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కురుమ సంఘం వికారాబాద్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, గోపాల్, ఎంపీడీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య, సంఘం నాయకులు వెంకటేశం, మల్లేశం, నర్సింలు, బీ శ్రీనివాస్, మహేష్, శంకర్, శ్రీశైలం, పాండు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు

ఇదేం భోజనం

కేజీబీవీ సిబ్బందిపై డీటీ ఆగ్రహం

బషీరాబాద్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఎందుకు పెట్టడంలేదని కేజీబీవీ ఎస్‌ఓపై డిప్యూటీ తహసీల్దార్ వీరేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్ ఆయన తనిఖీ చేశారు. విద్యార్థినులకు సరైన భోజనం పెట్టకపోవడంపై మండి పడ్డారు. కూరగాయలు ఎందుకు దాచి పెట్టారని నిలదీశారు. నాణ్యమైన భోజనం పెట్టకుంటే తమకు ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థుల్లో పోటీ తత్వం పెంచాలని సిబ్బందికి సూచించారు. ఎమైనా సమస్యలు ఉంటే తహసీల్దార్ కార్యాలయం, లేదా 1098 ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం బీసీ బాలికల హాస్టల్ సందర్శించారు. చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ హన్మంత్‌రెడ్డి, కేజీబీవీ ఎస్ఓ సుమిత్ర పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీటీ వీరేష్‌బాబు

ఇరు వర్గాల ఘర్షణ

తాండూరు: చిన్న పాటి విషయానికి తాండూరు పట్టణంలో ఇరు వర్గాలు గొడవ పడ్డాయి. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని శాంత్ మహల్ థియేటర్ ఎదురుగా ఉన్న ఓ బట్టల షాప్ వద్ద సాయిపూర్ ప్రాంతానికి చెందిన వ్యక్తులు వెళ్లారు. అయితే షాపులో బట్టలను చూశాక కొనకుండా వెళుతున్నారని షాప్ నిర్వాహకులు వారిపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఈ విషయమై ఇరు వర్గాలు ఘర్షణ పడ్డాయి. ఈ విషయం తాణాలో ఉన్న సీసీ కెమెరాలో చేసిన పోలీసులు సీఐ రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. సీఐతో పాటు ఎస్సైలు సంఘటన స్థలానికి వెళ్లి ఘర్షణ పడుతున్న వారిని చెదరగొట్టారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అనంతగిరి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన సోమవారం సాయంత్రం వికారాబాద్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్ మండలానికి చెందిన హరీష్‌కుమార్‌కు ఇద్దరు భార్యలు. ఇద్దరితోనూ అతనికి సఖ్యత లేదు. సోమవారం మద్యం మత్తులో హరీష్‌కుమార్ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో స్థానికులు మంటలు ఆర్పి వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శీను తెలిపారు.

పడకల్‌లో మహిళ..

తలకొండపల్లి: ప్రజాప్రతినిధి దూషించాడని ఓ మహిళా ఆత్మహత్యకు యత్నించింది. మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన పద్మమ్మను ఓ ప్రజాప్రతినిధి అకారణంగా అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో తన ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించింది. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటుంది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రతినెలా ఒకటిన పెన్షన్ ఇవ్వాలి

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బస్వరాజు

అనంతగిరి: ప్రతి నెలా ఒకటో తేదీ పెన్షన్ చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జొన్నల బస్వరాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ పెన్షన్ దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పెన్షన్ ఆలస్యం చేయవద్దన్నారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలో గల అన్ని ఆస్పత్రులలో క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 3 డీఏలు వెంటనే మంజూరు చేయాలన్నారు. 2023లో పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. 15 సంవత్సరాల కంట్రిబ్యూషన్ 12 సంవత్సరాలకు కుదింపు చేయాలన్నారు. పుణ్య క్షేత్ర దర్శనం కోసం ప్రతి సంవత్సరం ఒక నెల పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ప్రతి జిల్లాలో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ మెడికల్ బిల్స్ చెల్లించాలని విన్నవించారు. ప్రతి జిల్లాలో ఒక వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, ట్రెజరరీ జూకారెడ్డి, వికారాబాద్ బ్రాంచ్ అధ్యక్షుడు మాణిక్ ప్రభు, సంఘం నాయకులు పెంటయ్య, మల్లారెడ్డి, చెన్నారెడ్డి, రాధాకృష్ణ, మల్లేష్, శేఖర్, శ్రీహరి, వెంకట్‌సింగ్, నర్సిరెడ్డి, కిష్టయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు